646) లలిత

ప॥ ఇందరు నెఱుగుదు రీయర్థమే భువి। కందువ దగులుట కర్మముకొలది॥

చ॥ అదికి ననాది హరిదాస్యం బిది। వేదాంతంబులు వెలసినిది।
సోదించి కనిరి శుకనారదాదులు। పొదుగ నిక దమభాగ్యముకొలది॥

చ॥ అతిరహస్య మిది అచ్యుతుపై భక్తి। ప్రతిలేనిపరమపావనము।
చతురులై తెలిసిరి సనకాదిమునులు। తతి దొరకుట సుకృతఫలముకొలది॥

చ॥ పరము శ్రీవేంకటపతిసంకీర్తన। సొరిది గురు డొసగుసూక్ష్మ మిది।
చిరపుణ్యులు మును చేకొన్న నిజ మిది। మరిగి మనుట తమమనసులకొలది॥